క్లుప్తంగా

లింగోద్భవస్వామి ఆలయంలో భాగవత ప్రవచనం

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసి యున్న శ్రీ లింగోద్భవ స్వామి వారి దేవాలయం ఆవరణలో శ్రీమద్భాగవత సప్తాహ జ్ఞాన యజ్ఞ మహోత్సవాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి జూన్ 3 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమం ప్రతి రోజూ 8 గంటల పాటు కొనసాగుతుందని తెలిపారు. బ్రహ్మశ్రీ సోమాశి బాలగంగాధర శర్మ గారిచే భాగవత ప్రవచనం నిర్వహించ బడుతుందని తెలిపారు. జూన్ 3న సోమవారం రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీ కృష్ణ స్వామి వారి కల్యాణ మహోత్సవం జరుగుతుందని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



కర్లపాలెం: పౌష్టికాహారం తీసుకోవటం వలన ఆరోగ్యంగా ఉంటారని డాక్టర్ బెల్లంకొండ మాధవి అన్నారు. కర్లపాలెం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బాపట్ల యజ్ఞ హాస్పిటల్, స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో యజ్ఞ హాస్పిటల్ డాక్టర్లు బెల్లంకొండ యజ్ఞ శ్రీకాంత్, బెల్లకొండ మాధవి, టి.పవన్‌కుమార్‌లు సుమారు 200 మందికి ఉచితంగా గుండె, మధుమేహం, ఎముకలకు సంబంధించిన వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు టి.వెంకట సుబ్బారావు, టి.లలితబాబు, ఎస్.నాగమల్లేశ్వరరావు, వెంకటేశ్వరరావు, సోమశేఖర్ తదితరులు ఉన్నారు.

రగ్బీ పోటీల్లో లిటిల్ ఏంజెల్స్ విద్యార్థుల ప్రతిభ



బాపట్లటౌన్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని లిటిల్ ఏంజెల్స్ డైరెక్టర్ అభినవ్ తెలిపారు. ఈ నెల 25న ఉమ్మడి గుంటూరు జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళగిరిలోని బాపూజీ ఒలంపీయాడ్ స్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి రగ్బీ పోటీల్లో అండర్ 18 విభాగంలో ప్రతిభ కనబరిచి తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. తమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న వై.సతీష్, సీహెచ్.కార్తీక్‌రెడ్డిలు ఎంపికయ్యారన్నారు. వీరిరువురు ఈనెల 31 నుంచి విశాఖపట్నంలోని తిమ్మాపురంలో జరిగే రాష్ట్ర స్థాయి రగ్బీ క్రీడలో ఉమ్మడి గుంటూరు జిల్లా తరపున పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులను ఆదివారం పాఠశాలలో పాఠశాల ప్రిన్సిపాల్ సెబాస్టియన్, వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు.

పాటల పోటీల్లో విజేతలకు బహుమతులు



తెనాలి: పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్య 616 జయంతి సందర్భంగా శ్రీ వెంకటేశ్వర అన్నమాచార్యుల సంకీర్తన సేవా బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన సంకీర్తన పోటీల్లో విజేతలకు ఆదివారం నగదు బహుమతులు ప్రదానం చేశారు. స్థానిక గీతా మందిరంలో ఏర్పాటైన సమావేశానికి పాటిబండ్ల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఈదర వెంకట పూర్ణచంద్, పెనుగొండ వెంకటేశ్వరరావు, బచ్చు సాంబశివరావు, మాదల సత్య కుమారి, కొలిశెట్టి బాలా త్రిపుర సుందరి చేతుల మీదుగా బహుమతులు, జ్ఞాపికలను అందజేశారు. జూనియర్ విభాగంలో తుల్యశ్రీ,, అందే తన్మయి, సంహిత, యశస్విని, సీనియర్ విభాగంలో దేవిశెట్టి వెంకట శ్రీలక్ష్మి, వాసంతి, మాజేటి వాసవి, నాగ మహేశ్వరరావు, మారా లలిత కుమారి, ఏ.రాజ్యలక్ష్మి బహుమతులు అందుకున్నారు. లక్కరాజు కనకదుర్గ సభా పరిచయం చేశారు. సంగీతం ఉపాధ్యాయిని ఎం.మాల్కోస్, వీణ డిప్లమా హోల్డర్ ఎం.చంద్ర కోస్, డోలు వాద్యకారిణి షేక్ లలితా మనీషాను సంస్థ ఆధ్వర్యంలో సత్కరించారు. కొండపి శ్రీనివాసరావు వసుంధర దంపతులు పర్యవేక్షించారు. సభ్యులు అందె బాల చంద్ర మౌళి, కేశవరావు, గౌరావఝుల ఆంజనేయ శాస్త్రి, బొంతల శాంతి పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాల అడ్డాగా అతిథి గృహం

- రేపల్లెలో అతీగతీ లేక శిథిలావస్థకు చేరిన రెవెన్యూ అతిథి గృహం
- ఆవరణలో విష పురుగుల సంచారం
- మరమ్మతులు చేపట్టి వాడుకలోకి తీసుకురావాలని వివిధ గ్రామాల ప్రజల వినతి



రేపల్లెలో నిరుపయోగంగా మారిన రెవెన్యూ అతిథి గృహం

రేపల్లె రూరల్: ఆలనా పాలన కరువవ్వటంతో తాలూకా కార్యాలయ ఆవరణలోని రెవెన్యూ అతిథి గృహం బూత్ బంగ్లాను తలపిస్తోంది. అధికారులకు వసతి గృహంగా నిర్మించబడిన అతిథి గృహాన్ని రెవెన్యూకు చెందిన ఏ అధికారి పట్టించుకోక పోవటంతో పిచ్చి చెట్లు ఏపుగా పెరిగి చిట్టడవిలా తలపిస్తూ విష పురుగుల సంచారానికి అనువుగా మారింది. రాత్రుల సమయంలో తాలూకా ప్రాంగణంలో నిఘా కొరవడటంతో మందు బాబులకు ఈ అతిథి గృహం అడ్డాగా మారుతోంది. అయితే ఈ అతిథి గృహం సమీపంలో పోలీసు సర్కిల్ కార్యాలయం, సబ్ కోర్టు, సీడీపీవో కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం, సహాయ సాంఘిక సంక్షేమ శాఖాధికారి కార్యాలయాలు ఉండటంతో నిత్యం వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వివిధ పనులపై ఇక్కడికి వస్తుంటారు. పగటి సమయంలో కార్యాలయాలకు వచ్చే ప్రజలు కాసేపు సేద తీరేందుకు ఇక్కడ ఏర్పాటు చేసిన బల్లలపై కూర్చునేందుకు వచ్చిన వారికి తాగి పడేసిన మందు సీసాలతో పాటు విష పురుగులు సైతం దర్శనమిస్తుండటంతో ఆందోళనకు గురవ్వాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. గతంలో ఒక ఆవు ఇటుగా వచ్చి పాము కాటుకు గురై మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది.



అతిథి గృహం ఆవరణలో తాగి పడేసిన మందు సీసాలు

వినియోగంలోకి తెస్తే వసతికి ఉపయోగం

రేపల్లెను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయటంతో నిత్యం జిల్లా కేంద్రం నుంచి వివిధ శాఖల ఉన్నతాధికారులు అభివృద్ధి, సంక్షేమంపై సమీక్ష నిర్వహించేందుకు వస్తుంటారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ అతిథి గృహానికి మరమ్మతులు నిర్వహించి వినియోగంలోకి తీసుకువస్తే అధికారులు కాసేపు సేద తీరేందుకు ఉపయోగపడుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అతిథి గృహం ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించి వాడుకలోకి తెచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ చొప్పా రవీంద్రను వివరణ కోరగా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లటం జరిగిందని చెప్పారు. త్వరిత గతిన సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

తిరుమలకు కాలినడకన వెళుతున్న యువకులు

సీఎం జగన్ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ యువకుల పాదయాత్ర

భట్టిప్రోలు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా గెలుపొందాలని, వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు ఘన విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ శుక్రవారం భట్టిప్రోలు మండలం సూరేపల్లి గ్రామం నుంచి పార్టీ నాయకులు పేటేటి దుర్గా (కిరణ్),కర్రా తిరుపతయ్య (కల్యాణ్), శొంటి సాయిలు తిరుమలకు కాలినడకన బయలుదేరారు. ఆదివారం ఉదయం సింగరాయకొండకు చేరుకున్నారు. నెల్లూరు జిల్లా ఉలవపాడుకు చెందిన శివారెడ్డి వీరికి భోజన ఏర్పాట్లు చేశారు. అనంతరం కొండేపి నియోజకవర్గం టంగుటూరు వద్ద అశోక్‌బాబు టీమ్ సభ్యులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో సుబ్బారావు, రామకృష్ణ, రంగ, సురేష్, సిద్ధు, బద్రి, రవితేజ, సూర్య, అనీల్ తదితరులు వీరికి సంఘీభావంగా కొంత దూరం వారితో పాటు నడిచారు.



కిరణ్, కల్యాణ్, సాయిలకు స్వాగతం పలుకుతున్న అశోక్‌బాబు టీమ్ సభ్యులు

చికిత్స పొందుతూ మహిళ మృతి

బాపట్లటౌన్: చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన సంఘటన ఆదివారం పట్టణంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే పట్టణంలోని విజయలక్ష్మీపురంకు చెందిన కోరుకొండ విజయలక్ష్మి(58)గత కొంతకాలంగా ఫిట్స్‌తో బాధ పడుతోంది. గత నెల 19న ఇంట్లో పూజ చేస్తుండగా ఫిట్స్ రావడంతో దీపారాధనకు ఉంచిన దీపానికి చీరచెంగు అంటుకొని మంటలు వ్యాపించాయి. భర్త సుబ్బారావు ఆలస్యంగా చూడటంతో అప్పటికే శరీరం కాలింది. అప్పటి నుంచి మంగళగిరిలోని ఎన్ఆర్ఐ వైద్యశాలలో చికిత్స పొందుతుంది. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. సమాచారం అందుకున్న పట్టణ సీఐ యు.శ్రీనివాసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

హనుమజ్జయంతి వేడుకలకు ఏర్పాట్లు



పడమటిపాలెంలో 33 అడుగుల సుందరాంజనేయుని విగ్రహం



భట్టిప్రోలులో అభయాంజనేయ స్వామి

పడమటిపాలెం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం కోనేటిపురం పంచాయతీ పరిధిలోని పడమటిపాలెంలో కొలువైన శ్రీ సుందరాంజనేయ స్వామి వారి దేవాలయంలో జూన్ ఒకటో తేదీన హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించేందుకు సన్నద్ధం చేస్తున్నారు. దేవాలయ మేనేజింగ్ ట్రస్టీ, విశ్రాంత ఐఏఎస్ అధికారి పడమటి సుందర కుమార్ 2008లో స్వామి వారి 33 అడుగుల ఎత్తుగల విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. గ్రామస్తుల కోరిక మేరకు ఆయన విగ్రహంతో పాటు దేవాలయాన్ని కూడా నిర్మించారు. ఆలయ అంకురార్పణ నుంచి కోనేటిపురం మాజీ సర్పంచ్ దివంగత పడమటి నాగేంద్రరావు ధర్మకర్తగా వ్యవహరించారు. ప్రస్తుతం ఆయన కుమారుడు సుందర్ కుమార్ ఆ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

భట్టిప్రోలులో..

భట్టిప్రోలు బస్టాండ్ సెంటర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో జూన్ ఒకటో తేదీన హనుమజ్జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు, అన్నసంతర్పణ కార్యక్రమాలు జరుగుతాయని దేవస్థాన కమిటీ నిర్వాహకులు తెలిపారు. స్థానిక శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ప్రతిష్ఠించిన శ్రీ సువర్చలా సమేత శ్రీ అభయాంజనేయ స్వామి కల్యాణ మహోత్సవం కూడా ఆ రోజు జరుగుతుందని దేవస్థాన కమిటీ తెలిపింది.

28 నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు

ఐలవరం(భట్టిప్రోలు): ఐలవరం శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానంలో కొలువైన శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారికి హనుమజ్జయంతి పురస్కరించుకుని సమరసత నగర సంకీర్తన సంఘం ఆధ్వర్యంలో 5 రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆదివారం తెలిపారు. 28, 29, 30 తేదీలలో సాయంత్రం టీటీడీ సహకారంతో భజన సంకీర్తన, ఉపన్యాస కార్యక్రమాలు, స్వామి వారికి ప్రత్యేక పూజలు జరుగుతాయని పేర్కొన్నారు. 31 నుంచి జూన్ ఒకటో తేదీ వరకు 24 గంటల ఏకాహం, హనుమాన్ ఛాలీసా, భజన సంకీర్తన పారాయణను వివిధ సమాజాలతో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జయంతి పర్వదినాన తమలపాకులతో స్వామి వారికి సామూహిక పూజలు, అష్టోత్తర శత నామావళి పూజలు జరుగుతుందని పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం నిర్వహించడం జరుగుతుందని ఎస్ఎస్ఎఫ్ బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకర రావు తెలిపారు.

పూర్వ విద్యార్థులు ఆదర్శప్రాయులుగా ఉండాలి



పూర్వ విద్యార్థులతో మున్సిపల్ హైస్కూల్ ఉపాధ్యాయులు

బాపట్లటౌన్: పాఠశాల ఖ్యాతి పూర్వ విద్యార్థులపైనే ఆధారపడి ఉందని మున్సిపల్ హైస్కూల్ ఉపాధ్యాయుడు ఆదిశేషారెడ్డి అన్నారు. పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్ 1994–99 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం పట్టణంలోని పూర్ణ ప్యాలెస్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఉపాధ్యాయుడు ఆదిశేషారెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ హైస్కూల్ స్థాపించినప్పటి నుంచి ఎందరో విద్యార్థులు ఈ పాఠశాలలో చదువుకొని ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారన్నారు. పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు తమ వంతు సహకారం అందిస్తూనే ఉన్నారన్నారు. పూర్వ విద్యార్థులు మంచి స్థాయిలో స్థిరపడి ప్రస్తుతం చదువుకుంటున్న విద్యార్థులకు ఆదర్శంగా ఉండాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు అన్నం కోటేశ్వరరావు, సెక్రటరి మద్దిబోయిన రాంబాబు, శివప్రసాద్, నర్రా నరశింహారావు, కొటికలపూడి రవి, హైమావతి పాల్గొన్నారు.



భట్టిప్రోలు బౌద్ధ స్తూపం వద్ద మేఘావృతమైన ఆకాశం

వర్షాలతో ఊరట

గత ఐదు రోజులుగా ఎండ వేడిమికి ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజానీకానికి వాతావరణంలో నెలకొన్న మార్పు ఊరటనిచ్చింది. శనివారం నుంచి భట్టిప్రోలు మండలంలోని అన్ని గ్రామాలలో వర్షాలు పడుతున్నాయి. ఆకాశం మేఘావృతమై చల్లదనాన్ని గుమ్మరించడంతో ప్రజలు సేద తీరారు. తీవ్ర ఎండలు, వడగాల్పులతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలకు వాతావరణ మార్పు ఊరటనిచ్చింది. గాలులకు చెట్లకు ఉన్న మామిడి, నిమ్మకాయలు నేల రాలాయి.

\- భట్టిప్రోలు



పెదపులివర్రులో నేల రాలిన నిమ్మకాయలు ఏరుతున్న రైతు

తెనాలి కవులకు స్వర్ణకంకణ సత్కారం

తెనాలి: ఏలూరుకు చెందిన శ్రీశ్రీ కళావేదిక నిర్వహించిన 134వ అంతర్జాతీయ సీస పద్య కవి సమ్మేళనంలో తెనాలికి చెందిన ముగ్గురు కవులు/రచయితలకు జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో స్వర్ణకంకణ సత్కారం చేశారు. సంస్థ ఆధ్వర్యంలో ప్రచురించిన సీసీ పద్య వైభవం సంకలనానికి ఉభయ తెలుగు రాష్ట్రాల పద్య కవుల నుంచి మూడేసి సీస పద్యాలను ఆహ్వానించారు. ఆయా పద్యాలతో తీసుకొచ్చిన సంకలనం ఆవిష్కరణను ఆదివారం ఏలూరులోని వైఎంహెచ్ఏ కన్వెన్షన్ హాలులో నిర్వహించారు. సంకలనానికి డాక్టర్ పూర్ణప్రజ్ఞాచారి కవి ధర్మం అనే శీర్షికన తన పద్యాలను పంపారు. ఇదే వేదికపై తెనాలికి చెందిన పౌరాణిక నటుడు, పద్యకవి డాక్టర్ పాతూరి సుబ్రహ్మణ్య కవి, రంగస్థల నటుడు, పద్యకవి డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు పాల్గొన్నారు. సీస పద్య వైభవానికి పద్యాలను పంపిన వీరిని కూడా నిర్వాహకులు సత్కరించి స్వర్ణకంకణ సత్కారం చేశారు. మొత్తం 175 మంది కవులు కవి సమ్మేళనంలో పాల్గొన్నారు. కావ్యావిష్కరణ సభలో అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, సమన్వయకర్త శ్రీమతి కొల్లి రమావతి, జాతీయ మహిళా అధ్యక్షురాలు శ్రీమతి చిట్టి లలిత, జాతీయ కార్యదర్శి డాక్టర్ టి. పార్థసారథి, వేద పండితులు డా.కావూరు శ్రీనివాస శర్మ, ఏలూరు జిల్లా శాఖ అధ్యక్షులు శ్రీ హరికోటి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.



డాక్టర్ పూర్ణ ప్రజ్ఞాచారికి సత్కారం

వీరాంజనేయుని ఆలయంలో కోలాట భజన

జంపని(వేమూరు): మండలంలోని జంపని గ్రామంలో వేంచేసి యున్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో ఏకాదశి దీక్షతో నిర్వహిస్తున్న వార్షిక హనుమజ్జయంతి ఉత్సవాలలో భాగంగా ఆదివారం సువర్చలా సహిత అంజనేయస్వామి వారి ఆలయ ఉత్సవాన్ని ఆగమ శాస్త్ర ప్రకారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు కోలాట నృత్య భజన కార్యక్రమం నిర్వహించారు. శ్రీరామ భజన కీర్తనలకు అనుగుణంగా చిన్నారులు కోలాట భజన నిర్వహించారు. రవిచంద్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. శ్రీ సీతారామ భజన సమాజం, అంజనేయ భక్త సమాజం, తిరుమల తిరుపతి దేవస్థానముల దాస సాహిత్య ప్రాజెక్టు భజన సంఘాలు పాల్గొని భక్తి కీర్తనలు ఆలపించారు. సూర్యాష్టకం, సూర్య నమస్కారం స్తోత్రాలు పఠించారు. భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

కొనలేం.. తినలేం

కొండెక్కిన కాయగూరల ధరలు

భట్టిప్రోలు: ఎండల ధాటికి కాయగూరల సాగు తగ్గిపోయింది. దీంతో వేసవితో పోటీ అన్నట్టుగా కాయగూరల ధరలు మండిపోతున్నాయి. నెల వ్యవధిలోనే ధరలు రెట్టింపు అయ్యాయి. గత వారం రోజులుగా కాయగూరల ధరలు ఆకాశాన్ని అంటాయి. సామాన్యుడు ఏ మాత్రం కొనలేని పరిస్థితి నెలకొంది. పచ్చిమిర్చి రూ.100, టమాటా కిలో రూ.40 పలుకుతుంది. క్యారెట్ కిలో రూ. 40 నుంచి 60కి పెరగగా బీన్స్ రూ.80 నుంచి రూ.100కు చేరుకుంది. కాకర రూ.80, బెండ రూ.60, దోస రూ.50 పలుకుతున్నాయి. గత వారంతో పోలిస్తే అన్ని కాయగూరల ధరలు రెండింతలు అయ్యాయని వినియోగదారులు చెబుతున్నారు.



భట్టిప్రోలులోని ఓ కాయగూరల దుకాణం

తెనాలి రచయితలకు అన్నమయ్య పురస్కారాలు

తెనాలి: సంప్రదాయ కళల పరిరక్షణ సమితి, చిత్తూరు ఎఎస్ ఫౌండేషన్, తిరుపతి సంస్థల నిర్వహణలో ఆదివారం చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గ పరిధిలోని బైరెడ్డిపల్లిలో జరిగిన సాహితీ వేడుకల్లో తెనాలి రచయితలు అన్నమయ్య పురస్కారాలను స్వీకరించారు. తెనాలికి చెందిన కవి, రచయిత ఆళ్ల నాగేశ్వరరావు నాలుగు దశాబ్దాలుగా సాహితీ రచనలు చేస్తూ తెలుగుభాషా వికాసానికి చేస్తున్న కృషికి గుర్తింపుగా అన్నమయ్య పురస్కారం అందజేసినట్టు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మడవలి చిరంజీవి, సంస్థ ప్రధాన కార్యదర్శి మడవలి తులసి, ఎ.ఎస్ ఫౌండేషన్ అధ్యక్షులు అభీలాల శ్రీధర్ తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి హాజరైన వివిధ రంగాల ప్రముఖ కళాకారులు, చిత్తూరు జిల్లా అధికారులు పాల్గొన్నారు. వెంకట రఘునాథరావుకు స్థానిక శారదా ఎలిమెంటరీ పాఠశాలలో పనిచేస్తున్న మునిపల్లె వెంకట రఘునాథరావు కూడా ఇదే వేదికపై అన్నమయ్య పురస్కారాన్ని స్వీకరించారు. ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డుతో పాటు కళారంగానికి ఆయన చేస్తున్న సేవలకు ఈ గుర్తింపును అందజేసినట్టు నిర్వాహకులు తెలిపారు.



ఆళ్ల నాగేశ్వరరావుకు అన్నమయ్య పురస్కారం

పది విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

ఉత్తమ ప్రతిభ కనబరచిన వారికి జాబిల్లి సేవా సంఘం ఆర్థిక చేయూత

తెనాలిఅర్బన్: విద్యలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సాహించేందుకు జాబిల్లి సేవా సంఘం ముందుకు రావడం అభినందనీయమని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్ పేర్కొన్నారు. జాబిల్లి సేవా సంస్థ ఆధ్వర్యంలో పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన 15 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.2 వేలు చొప్పున కొత్తపేటలోని దీప్తి పబ్లికేషన్ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని వాటిని సాధించే దిశగా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ప్రోత్సాహించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంస్థ గౌరవ అధ్యక్షులు కోసరాజు వెంకట్రావు, అధ్యక్షులు ఆంజనేయులు, విశ్రాంత అధ్యాపకులు శైలజ, రాజేశ్వరి, రమాదేవి, పూర్ణచంద్రరావు, అమిరినేని శివరామప్రసాద్, సీఆర్‌పీఐ శ్రీదేవి, వేజళ్ల నవ్య, బి.శివరామకృష్ణ పాల్గొన్నారు.



నగదు ప్రోత్సాహక బహుమతులు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

మహిళా స్వావలంబనే సేవాభారతి లక్ష్యం



తెనాలి: మహిళా స్వావలంబన, ఆత్మ విశ్వాసం పెంపొందించటమే సేవా భారతి లక్ష్యమని ఆ సంస్థ జిల్లా కార్యదర్శి, న్యాయవాది పద్మవల్లి అన్నారు. స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని సేవాభారతి కార్యాలయం మధుకర నిలయంలో సోదరి నివేదిక కుట్టు శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. సేవాభారతి, తెనాలి కార్యదర్శి వి.లక్ష్మీనారాయణ పర్యవేక్షించారు. జిల్లా సంయోజక్ జాగు శ్రీనివాస్, ప్రాంత పర్యావరణ సంరక్షణ గతివిధి ప్రాంత సంయోజక్ పీవీ ఆదిశేషయ్య, టైలరింగ్ శిక్షకులు యార్లగడ్డ రోషిత, బ్యూటీషియన్ శిక్షకురాలు వి.విజయదుర్గ పాల్గొన్నారు. నగర కార్యవాహ త్రిపురమల్లు హనుమత్ ప్రసాద్ స్వాగతం పలికారు. పలువురు నగర ప్రముఖులు, అభ్యాసకులు పాల్గొన్నారు. తదుపరి రెండో బ్యాచ్ శిక్షణను జూన్ 20 నుంచి ఆరంభిస్తామని, శిక్షణార్థులు ఈలోగా తమ పేర్లను కార్యాలయంలో నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9441753817 నంబరును సంప్రదించాలని కోరారు.